క్లుప్తంగా

అనుమతి లేకుండా స్టాళ్లు ఏర్పాటు చేయొద్దు



స్టాళ్లను తొలగించాలని ఆదేశిస్తున్న ఆర్డీఓ హరిప్రసాదు

కర్నూలు(సెంట్రల్): అనుమతి లేకుండా బాణ సంచా స్టాళ్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ హరిప్రసాదు హెచ్చరించారు. దీపావళి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రాకర్ విక్రయాలకు వంద స్టాళ్లకు అనుమతులు ఇచ్చారు. స్థానిక ఎస్టీబీసీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న దాదాపు 10 షాపులను సిబ్బందితో తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట కర్నూలు అర్బన్ తహసీల్దార్ విజయశ్రీ ఉన్నారు.

13న సామూహిక కేదారేశ్వర వ్రతాలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో అమావాస్యను పురస్కరించుకుని ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు సామూహిక కేదారేశ్వరవ్రతాలు నిర్వహించనున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి శుక్రవారం తెలిపారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీ వెంకటఅన్నమాచార్యసేవాట్రస్ట్ ఆధ్వర్యంలో 27సార్లు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, భజన, నవ విధ మంగళ హారతులు, మహా అన్న ప్రసాదం కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

జిల్లా వాసికి గౌతమ్ బుద్ధ పీస్ అవార్డు

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌ను అంతర్జాతీయ స్థాయి గౌతమ్ బుద్ధ పీస్ అవార్డు వరించింది. నైజీరియాకు చెందిన అంతర్జాతీయ సంస్థ డైనమిక్ పీస్ రెస్క్యూ మిషన్ ఇంటర్నేషనల్ గ్లోబల్ కమాండెంట్ జనరల్ ప్రొఫెసర్ ఏబోరియా చార్లెస్ అవార్డును శుక్రవారం వర్చువల్‌గా ప్రదానం చేశారు. ఇంటర్నేషనల్ నైస్‌నెట్‌వర్క్ ఇండియా ప్రతినిధిగా ప్రపంచ శాంతి, మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు 2021-22 సంవత్సరానికి వార్డును ప్రదానం చేసినట్లు రాయపాటి తెలిపారు.

స్టాఫ్‌నర్సుల భర్తీలో అభ్యర్థులకు అన్యాయం

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌డీ పరిధిలో జరుగుతున్న స్టాఫ్‌నర్సుల పోస్టుల భర్తీలో అక్రమాలు జరుగుతున్నాయని, దీనివల్ల అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జోన్ -1లో కోవిడ్‌లో పనిచేసిన స్టాఫ్‌నర్సులకు సర్వీస్ వెయిటేజీ ప్రభుత్వం ఇచ్చినా అధికారుల నిర్లక్ష్యం వల్ల వారికి ఉద్యోగాలు రాలేదన్నారు. జోన్ -2లో సర్వీసు సర్టిఫికెట్లు ఒరిజినల్ ఇవ్వాలని అభ్యర్థులను ఇబ్బంది పెట్టడమే గాక మెరిట్‌లిస్ట్‌లో కూడా అవకతవకలకు పాల్పడ్డారని విమర్శించారు. జోన్ -4లో గతంలో ఎవరైతే కాంట్రాక్టులో ఆర్‌డీ పరిధిలో పని చేస్తున్నారో వారిని అర్హులుగా పరిగణించవద్దని నోటిఫికేషన్‌లో స్పష్టంగా ఉన్నా అధికారులు అవేమీ పట్టించుకోకుండా పోస్టులను భర్తీ చేశారన్నారు. అధికారులు జరిగిన తప్పులను సరిదిద్దుకుని అర్హత ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు.

ఇంధన పొదుపుపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): ఇంధనం (డీజిల్) పొదుపు చేసేందుకు ప్రతి డ్రైవర్ తగిన సూచనలు పాటించాలని రోడ్డు రవాణా సంస్థ కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ అన్నారు. శుక్రవారం ఆయన డిపో గ్యారేజీలో డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజిల్ ధరలు సంస్థకు భారంగా మారుతున్న నేపథ్యంలో ప్రతి పొదుపు చర్యలు చేపట్టాలన్నారు. ఇటు మెకానిక్‌లు కూడా బస్సులు మైలేజీ వచ్చేలా నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్, రూరల్స్ డిప్యూటీ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వై.సుబ్బన్న, రాజేంద్రబాబు శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. కర్నూలు-1, 2, రూరల్స్ సబ్ డివిజన్ల పరిధిలోని 33 సబ్‌స్టేషన్లు, పవర్ హౌస్, పోలీస్ క్వార్టర్స్, ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్‌ఏపీ క్యాంప్, రేడియో స్టేషన్, మామిదాలపాడు, సంతోష్‌నగర్, జొహరాపురం, శరీన్ నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, వార్త ఏరియా, సబ్‌స్టేషన్లు, 33, 11కేవీ ఫీడర్ల పరిధిలో అభివృద్ధి, నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ కోత ఉంటుందన్నారు. రూరల్స్ సబ్ డివిజన్‌లోని కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు మండలాల్లోని పనులు నిర్వహించనున్నామని, ఈ సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా అందించే కాలనీలు, గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

అభివృద్ధిలో కర్నూలు అగ్రస్థానం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో సమస్యలు గుర్తించి పరిష్కానికి చర్యలు
- రూ.125 కోట్లతో జొహరాపురం వద్ద 50 ఎంఎల్‌డీ ప్లాంటు ఏర్పాటు
- బళ్లారి చౌరస్తా వద్ద అండర్ పాస్ నిర్మాణానికి చర్యలు
- మెట్రో పాలిటన్ స్థాయిలో నగరంలో పార్కుల ఏర్పాటు
- విలేకరుల సమావేశంలో మేయర్ బీవై రామయ్య, కమిషనర్ భార్గవ్‌తేజ్ వెల్లడి



మాట్లాడుతున్న నగర మేయర్ బీవై రామయ్య. చిత్రంలో కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): రాష్ట్రంలోనే కర్నూలును అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపామని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరపాలక కౌన్సిల్ హాలులో కమిషనర్ భార్గవ్‌తేజతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధిని మెట్రో పాలిటన్ సిటీస్‌ను మరిపించే విధంగా చేపడుతున్నామన్నారు. రూ.5 కోట్లతో మునగాల పాడు వద్ద 15 ఎంఎల్‌డీ ట్రీట్‌మెంట్ ప్లాంటు పూర్తి చేసి కోడుమూరు అర్బన్ ప్రాంత ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామన్నారు. రూ.125 కోట్లతో పాణ్యం పరిధిలోని శివారు కాలనీల ప్రజలకు తాగునీటి వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు జొహరాపురం సమీపంలో 50 ఎంఎల్‌డీ ప్లాంట్ ట్రీట్ మెంట్ ప్లాంటు చేపట్టే పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. స్వచ్ఛ భారత్‌లో దేశంలోనే 55 వ స్థానం, రాష్ట్రంలో రెండవ స్థానం సాధించామని, రాబోయే రోజుల్లో మొదటిస్థానానికి చేరుకుంటామన్నారు. బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అండర్ పాస్ నిర్మాణం త్వరలో చేపడుతున్నామన్నారు. ప్రతి సచివాలయానికి ఇచ్చే రూ.20 లక్షలను రూ.40 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ఈ నిధులతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఖర్చు చేస్తున్నామన్నారు.

రికార్డు స్థాయిలో సేవలు

నగర వాసులకు రికార్డు స్థాయిలో సేవలందించామని కమిషనర్ భార్గవ్‌తేజ చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం పేరుతో వలంటీర్లను ఇంటింటికి పంపి 1.48 లక్షల మందిని సర్వే చేసి 1,19,366 సేవలు అందించామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ఏర్పాటు చేసిన 48,638 మందికి మందులు, 5,660 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. గడపకు గడపకు మన ప్రభుత్వం కింద కర్నూలులో రూ.77 కోట్లు, పాణ్యంలో రూ.10.32 కోట్లు, కోడుమూరులో రూ.84 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే రూ.14.90 కోట్ల పనులు పూర్తి చేశామన్నారు. వర్షాల కారణంగా సుంకేసులకు భారీగా నీరు చేరుకుందని, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు నగర వాసుల భవిష్యత్తు అవసరాలకు సుంకేసులలో 1.2 టీఎంసీ, జీడీపీలో 1.5 టీఎంసీ నీరు నిలువ ఉంచే విధంగా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఈఈ శేషసాయి, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

అన్ని వార్డులను అభివృద్ధి చేస్తాం

- మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: నగరంలో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 19వ వార్డు మథర్‌ల్యాండ్‌లో రూ.65 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లూరు అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తోందన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి ఆయా కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. టీడీపీ హయాంలో నగరంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండేవన్నారు నగర పాలక సంస్థలో పాలక వర్గం ఏర్పడ్డాక అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, ఎంఈ శేషసాయి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసిన ప్రభుత్వం మళ్లీ రావాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న కర్రా హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు

- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ మోహన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): అన్ని వర్గాలకు మంచి చేసిన ప్రభుత్వం మళ్లీ రావాల్సిన అవసరముందని వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 49వ వార్డు ప్రకాష్ నగర్ ప్రాంతంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం చేసిన మేలును, లబ్ధిదారులకు చేకూరిన లబ్ధిని వివరించారు. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చంద్రబాబు విస్మరించారన్నారు. పొదుపు మహిళలు, రైతులు, కార్మికులు, స్వయం ఉపాధి మహిళలను మోసం చేసిన వ్యక్తి టీడీపీ అధినేత అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచి అనేక పథకాలను అమలు చేస్తూ వచ్చారని, పథకాల అమలులో ఎంతో పారదర్శకత పాటించినట్లు చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నారని, ఇలాంటి సేవలు దేశంలో ఎక్కడా లేవని చెప్పారు. భవిష్యత్తులో మరింత మంచి చేసేందుకు జగనన్నే మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కృష్ణకాంత్‌రెడ్డి, క్లస్టర్ కన్వీనర్ ఆదిమోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు మద్దయ్య, భాస్కర్‌రెడ్డి, కృష్ణకాంత్ శర్మ శ్రీనివాస రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురం సచివాలయం-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గతంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం దగ్గర రోజుల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీనే ఠంచన్‌గా ఇంటివద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏ సమయంలో పిలిచినా తాను అందుబాటులోనే ఉంటానన్నారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, గ్రామ సర్పంచ్ సోమేశ్వరమ్మ, సింగిల్ విండో చైర్మన్లు వినయ్‌కుమార్ రెడ్డి, శేషిరెడ్డి, ఎల్లా నాగిరెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, గార్గేయపురం మాజీ సర్పంచ్ యేసేపు పాల్గొన్నారు.

కర్నూలు రత్నాలు అవార్డులకు ముగ్గురు ఎంపిక



ఇంతియాజ్




ఆనందరావు



ఫజల్ రహమాన్

కర్నూలు(సెంట్రల్): మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా విద్యా, అల్ప సంఖ్యాక సంక్షేమ దినోత్సవాలను పురస్కరించుకుని జిల్లా మేధావుల కాన్సర్టియం ఆధ్వర్యంలో ఇవ్వనున్న కర్నూలు రత్నాలు అవార్డులకు ముగ్గురిని ఎంపిక చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య మన్సూర్ రహ్మాన్, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూరు శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏడాది కర్నూలు రత్నాలు అవార్డులకు ఐఏఎస్ అధికారి ఇంతియాజ్, రాయలసీమ, ఉర్దూ యూనివర్సిటీల వైస్‌చాన్సలర్లు ఆనందరావు, ఫజల్ రహమాన్‌లు ఎంపికయ్యారన్నారు. వీరికి త్వరలోనే అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

పతకాలు సాధించిన న్యాయవాదులకు సన్మానం



న్యాయవాదులను అభినందిస్తున్న జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఈత పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించిన సీనియర్ న్యాయవాదులు బి.గఫూర్ మియ్యా, ఎంఎల్ శ్రీనివాసరెడ్డిలకు శుక్రవారం సాయంత్రం కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం ఘన సన్మానం చేసింది. సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆరుపదుల వయస్సు దాటినా పట్టుదలతో ఈత పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన సీనియర్ న్యాయవాదులను అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు, అదనపు జిల్లా జడ్జీలు సునీత, భూపాల్‌రెడ్డి, సబ్ జడ్జీలు నాగశ్రీనివాసరావు, దివాకర్, మెజిస్ట్రేట్స్ బాబా ఫక్రుద్దీన్, జ్యోత్స్న దేవి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చక్రపాణి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

26న జిల్లా 4వ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు



ఎన్జీవో నేతలతో నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈనెల 26న జిల్లా 4వ తరగతి ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.మద్దిలేటి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, జవహర్‌లాల్, నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్నలను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమానికి హాజరు కావాలని వెంగళ్‌రెడ్డిని కోరారు.

'చెప్పు'కోలేని బాధ



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల లోపలికి వెళ్లి తిరిగి వచ్చేసరికి చెప్పులెక్కడున్నాయో అర్థం కాదు. వాటిని వెతుక్కోవడానికి తలప్రాణం తోకకు వస్తోంది. ఆసుపత్రిలోని అన్ని విభాగాల వద్ద ఇదే పరిస్థితి. ఆయా విభాగాల వద్ద చెప్పల స్టాండ్ లేకపోవడంతో రోగులు, వారి సహాయకులు చెప్పలను బయట వరండాలో వదిలివెళ్లాల్సి వస్తోంది. బయటకు వచ్చేలోగా ఏ చెప్పు ఎక్కడ ఉందో అర్థం కాని పరిస్థితి. కొన్నిసార్లు చెప్పలు సైతం మాయమవుతుండటంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా విభాగాల వద్ద చెప్పల స్టాండ్‌లను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. - కర్నూలు(హాస్పిటల్)

గ్రూపు-1, 2 పోస్టులను పెంచాలి

కర్నూలు(సెంట్రల్): గ్రూపు-1, 2 నోటిఫికేషన్లలో పోస్టుల సంఖ్యను పెంచాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి నోటిఫికేషన్‌లో చేర్చాలన్నారు. వయో పరిమితిని కూడా 42 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచాలన్నారు. వెంటనే ఏపీపీఎస్‌సీ ద్వారా నోటిఫికేషన్లను విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నగరకార్యదర్శి బీసన్న పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు(సెంట్రల్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.బాబురావు సూచించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగామహిళ సంఘాలను గ్రామ, మండల, జిల్లా స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. పార్టీ సమావేశాల్లో మహిళలు అధికంగా పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళ జిల్లా అధ్యక్షురాలు ప్రమీళ, నాయకులు దామోదరం రాధాకృష్ణ, బతుకన్న, రియాజ్, లాజరస్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను కర్నూలులో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా తెలిపారు. శుక్రవారం మహాసభల లోగో, పోస్టర్‌ను హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-4 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడితో వారు ఆవిష్కరింపజేశారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించే మహాసభలకు జిల్లావ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు.

కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

కర్నూలు(సెంట్రల్): వర్షాభావం నెలకొన్న మండలాలన్నింటినీ కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ నాయకులు డీఆర్వో కె.మధుసూదన్‌రావును ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఈరన్న, నాయకులు సాయిప్రదీప్, కోటి యాదవ్, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

'జి.పుల్లయ్య'లో ఒడిసి టెక్నికల్ పోటీలు

కర్నూలు సిటీ: జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవాకం ఐ-ట్రిపుల్‌ఈ జీపీ సెట్ స్టూడెంట్ బ్రాంచ్ ఒడిసి టెక్నికల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ కె.కృష్ణనాయక్(ఈసీఈ విభాగాధిపతి, ట్రిపుల్‌ఐటీడీఎం, కర్నూలు), డా.కె సత్యబాబు(సీఎస్ఈ విభాగాధిపతి, ట్రిపుల్ఐటీడీఎం, కర్నూలు) తదితరులు హాజరయ్యారు.

18 వరకు న్యాయవాదులు విధుల బహిష్కరణ

కర్నూలు (లీగల్): రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయించిన వెల్ఫేర్ స్టాంప్ రూ.20లకు వ్యతిరేకంగా చేపట్టిన విధుల బహిష్కరణ ఈనెల 18వ తేదీ వరకు కొనసాగిస్తున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నాగభూషణం నాయుడు, ఎం.వి.చక్రపాణిలు తెలిపారు.

భక్త కనకదాసు జయంతిని నిర్వహించాలి

కర్నూలు (అర్బన్): ఈనెల 30న భక్త కనకదాసు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురువ యువజన సంఘం అధ్యక్షుడు బత్తిని కిరణ్‌కుమార్ శుక్రవారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మను కలసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంగొల్లి రాయన్న, రంగస్వామి, మురళీమోహన్, గిరి పాల్గొన్నారు.

వెంకటరామిరెడ్డి సేవలు మరువలేనివి



పదవీ విరమణ చేసిన వెంకటరామిరెడ్డితో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): సీడ్ సర్టిఫికేషన్ అధికారిగా వెంకటరామిరెడ్డి ఉమ్మడి కర్నూలు జిల్లాకు అందించిన సేవలు మరువలేనివని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. రాయలసీమ జోన్ చీఫ్ సీడ్ సర్టిఫికేషన్ అధికారిగా పనిచేస్తున్న జి.వెంకటరామిరెడ్డి అక్టోబరు చివరిలో పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, ఇన్‌చార్జ్ చీఫ్ సర్టిఫికేషన్ అధికారి శ్రీహరిరెడ్డి, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీజీలతో స్కానింగ్ చేయిస్తారా

- రేడియాలజీ విభాగం వైద్యులపై సూపరింటెండెంట్ ఆగ్రహం

కర్నూలు(హాస్పిటల్): 'ఆసుపత్రిలోనే రేడియాలజీ అతి పెద్ద విభాగం. ఇందులో ఏడుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. పగలు కూడా పీజీలే రోగులకు స్కానింగ్ చేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఏం పనిచేస్తున్నారు' అని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన రేడియాలజీ విభాగం వైద్యులతో మాట్లాడారు. స్కానింగ్ కేంద్రంలో పీజీలు స్కానింగ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాత్రివేళల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు తప్పనిసరిగా డ్యూటీలో ఉండాలని ఆదేశించారు. ఏడుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జాబితాతో రోస్టర్ వేస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల విధులపై హెచ్‌ఓడీ పర్యవేక్షణ చేయాలన్నారు. అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని నిర్వహించకపోవడంపైనా అసహనం వ్యక్తం చేశారు.

అబుల్ కలాం సేవలు చిరస్మరణీయం

కర్నూలు (న్యూటౌన్): మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషలలో పండితులని, విద్యాశాఖ మంత్రిగా అందరినీ మెప్పించారని ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఉస్మానియా కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ అన్నారు. శుక్రవారం ఉస్మానియా కళాశాలలో ఉర్దూ అరబిక్ పర్షియన్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవంగా గుర్తించారని, విద్యార్థులు మౌలాన అబుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అబ్దుల్ లతీఫ్, సలీంబాషా, వహబ్, అబ్దుల్ కరీం, సాజిద్, మహమ్మద్ సోహెల్, విద్యార్థులు పాల్గొన్నారు.

'రవీంద్ర' విద్యార్థి ప్రతిభ



దేవ్‌శ్రుత్‌సాయి

కర్నూలుసిటీ: తమ విద్యార్థి వై.దేవ్‌శ్రుత్‌సాయి ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో మూడు బంగారు పతకాలు సాధించాడని రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జి.వి.ఎం మోహన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్కూల్‌లో ఆయన విద్యార్థిని అభినందించారు.

కర్నూలు స్విమ్మర్ ప్రతిభ



స్విమ్మర్ భువనాదిత్యా

కర్నూలు (టౌన్): తిరుపతిలో అండర్-19 విభాగంలో నిర్వహించిన అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీల్లో కర్నూలు స్విమ్మర్ భువనాదిత్యా సత్తా చాటారు. 1,500 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో వెండి, 400 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారుడిని ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి జి.పద్మావతి అభినందించారు.

పాలస్తీనాపై దాడులను ఆపాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, ఎస్‌యూసీఐ జిల్లా నాయకులు నాగన్న నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజశేఖర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు స్థలాల కేటాయింపు

కర్నూలు (టౌన్): కేసీ కెనాల్ ఫుట్‌పాత్ వ్యాపారులకు శుక్రవారం లాటరీ పద్ధతిన షెడ్లు కేటాయించారు. స్థానిక నగర పాలక కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ భార్గవ్‌తేజ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, టౌన్ ప్రాజెక్టు అధికారి వెంకటలక్ష్మీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు పాల్గొని పళ్ల వ్యాపారులకు 24, మొబైల్ క్యాంటీన్ ఏర్పాటుకు 14 మందికి స్థలం కేటాయించారు.